క్లుప్తంగా

రేపు ఆత్మీయ సమ్మేళనం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని కొట్టె చిన్న వెంకటసుబ్బయ్య ఉన్నత పాఠశాల 2000–2005 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నామని, పూర్వ విద్యార్థులందరూ హాజరు కావాలని వారు కోరారు.

వైభవంగా మహా మండలార్చన



మహా మండలార్చనలో పాల్గొన్న మఠాధిపతులు

మైదుకూరు : మైదుకూరులో శుక్రవారం మాత గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మహామండలార్చనను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మంగారి మఠంలో బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక సర్వాయిపల్లె రోడ్డులోని ఎలైట్ పార్క్ ప్రాంగణంలో ఈ మండలార్చన నిర్వహించారు. ఈశ్వరీదేవి మఠాధిపతి వీరశివకుమారస్వామి, అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి, తెలంగాణ సిద్ధిపేట వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మఠాధిపతి వీరధర్మజస్వామి, బనగానపల్లె మఠాధిపతి శ్రీనివాసాచార్య స్వామి పాల్గొని మహా మండలార్చన కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మంగారి భక్తులతోపాటు మాలధారణ చేసిన వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాచనూరు సుబ్బరాయుడు అన్న ప్రసాద వినియోగం చేశారు.

భక్తి శ్రద్ధలతో మృత్యుంజయ హోమం



హోమంలో పూర్ణాహుతిని సమర్పిస్తున్న వేదపండితులు, భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆరుద్ర నక్షత్రం, శంకర జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, ఆది శంకరాచార్యులకు విశేష పూజలు నిర్వహించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, ఉప దేవత, మృత్యుంజయ హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ కె.రామచంద్రాచార్యులు, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య

గోపవరం : ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వలన రైతులు అప్రమత్తంగా ఉండాలని రాచాయపేట రైతుసేవా కేంద్రం వ్యవసాయ విస్తరణాధికారి ఓబయ్య పేర్కొన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలో ఎక్కడా కూడా పంట నష్టం జరగలేదని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న వేరుశనగ, పెసర పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంకా అధిక వర్షాలు పడితే పెసర పంట నష్టపోయే అవకాశం ఉందని, వర్షం పడిన ట్లైతే పంట పొలంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ఈయన వెంట ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



అర్బన్ సీఐ రమణారెడ్డి

మైదుకూరు : ప్రజల శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని మైదుకూరు అర్బన్ సీఐగా రమణారెడ్డి తెలిపారు. మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.రమణారెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వి.శ్రీహరి కడప సీసీఎస్–2కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐగా ఉన్న రమణారెడ్డిని మైదుకూరుకు బదిలీ చేశారు.

రేపు ఉచిత షుగర్ పరీక్షలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని బంగారుశీనయ్య హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు శీనయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత శిబిరంలో ఉదయం 7 గంటల నుంచి 12 గంటల వరకు షుగర్ పరీక్షలతో పాటు కొలెస్ట్రాల్, కిడ్నీ పరీక్షలు నిర్వహించనున్నారని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తూకం.. అంతా మోసం

- అమ్మకాల్లో వ్యాపారుల చేతివాటం
- నిత్యావసర సరకుల కొలతల్లో తేడా
- కిలోకు వంద గ్రాముల వరకూ కోత
- వినియోగదారుల జేబులకు చిల్లు



పెస్టిసైడ్స్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : జిల్లాలోనే కాదు.. రాష్ట్రంలోనే ప్రొద్దుటూరు వ్యాపారానికి ప్రసిద్ధి. బంగారం దుకాణాలతో పాటు వస్త్రాలు, దాల్‌మిల్లులు, రైస్‌మిల్లులు, పత్తి మిల్లులు అనేకం ఇక్కడ ఉన్నాయి. ఇక్కడున్న అతి పెద్ద కూరగాయల మార్కెట్ రాయలసీమ జిల్లాలో ఎక్కడా లేదని చెప్పొచ్చు. రాయలసీమ జిల్లాల నుంచి ప్రొద్దుటూరు మార్కెట్‌కు పలు రకాల కూరగాయలు వస్తుంటాయి. బంగారం వ్యాపారంలో అయితే ప్రొద్దుటూరుకు రెండో ముంబైగా పేరుంది. అసలే నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకు పెరిగిపోతూ ప్రజలను షాక్‌కు గురి చేస్తుంటే.. తూకాల్లో జరుగుతున్న మోసాలు ప్రజలను మరింత బెంబేలెత్తేలా చేస్తున్నాయి. స్థానికంగా ఉన్న కొన్ని ప్రాంతాల్లోని పండ్లు, కూరగాయలు, మాంసం, ఇతర దుకాణాల్లోని తూకాల్లో భారీగా వ్యత్యాసం కనిపిస్తోంది. సంబంధిత అధికారులు నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కనిపించని ప్యాకింగ్ నిబంధనలు

నిబంధనల ప్రకారం మార్కెట్‌లో విక్రయించే నిత్యావసర సరుకులు ప్యాకింగ్ చేసేందుకు తూనికలు, కొలతల శాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంది. అయితే ఎలాంటి అనుమతి లేకుండానే కొన్ని దుకాణాల్లో సొంతంగా ప్యాకింగ్ చేసి బార్ కోడ్ స్టిక్కర్‌ను అంటిస్తున్నారు. ప్రొద్దుటూరులోని చిన్నపాటి దుకాణాల నుంచి సూపర్‌మార్కెట్‌ల వరకు ప్యాకింగ్ సరుకులను విక్రయిస్తూ నిబంధలను బేఖాతరు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు మాత్రం వీటిని పట్టించుకోవడం లేదు. నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. కొన్ని రకాల వస్తువుల డబ్బాలు, ప్యాకింగ్‌లపై ఉన్న ఎమ్మార్పీని చెరిపేసి వాటిపై స్టిక్కర్లను అంటిస్తున్నారు. ఇది లీగల్‌మెట్రాలజీ చట్టం ప్రకారం నేరం.

బియ్యం ప్యాకెట్లలోనూ మోసాలు

ప్రొద్దుటూరులో రైస్‌మిల్లులు, బియ్యం విక్రయ దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. చాలా దుకాణాల్లో 25 కేజీల తూకంతో బియ్యం ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. కొందరు వ్యాపారులు 23 కేజీలు, 24 కేజీల బియ్యంతో ప్యాకెట్‌లను నింపుతున్నారు. ప్యాకెట్‌పై మాత్రం 25 కేజీలు ఉన్నట్లు ముద్రిస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లో కొందరు వ్యాపారులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. కేజీ కూరగాయలు కొంటే 100 గ్రాముల వరకు తక్కువ తూగుతున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. కొందరు వ్యాపారులు కొసరు కింద ఎక్కువ కూరగాయలు వేసినా తూకం తక్కువే వస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ప్రొద్దుటూరులో వందలాది చికెన్, మటన్ దుకాణాలు ఉన్నాయి. మటన్ దుకాణాల్లో తూకం తక్కువగా వస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్‌లలో ఖచ్చితంగా 1,000 గ్రాముల తూకం చూపి కిలో మటన్ విక్రయాలు సాగిస్తున్నారు. తీరా ఇంటికి వెళ్లి తూకం వేసుకున్న వారికి నిరాశే మిగులుతుంది. కొన్ని చోట్ల కిలోకు 100–150 గ్రాములు మాంసం తక్కువ వస్తున్నట్లు ప్రజలు అంటున్నారు.

ఆకస్మిక తనిఖీలు లేకనే

తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయకపోవడం వల్లనే మార్కెట్‌లో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అధికారుల తనిఖీలకు వస్తున్నారన్న ముందస్తు సమాచారంతో వ్యాపారులు జాగ్రత్త పడుతున్నారు. ముందస్తు సమాచారం ఎవరిస్తున్నారనేది అధికారులకే తెలియాలి.

3 ఏళ్లలో నమోదైన కేసులు

సంవత్సరం	ముద్ర రుసుములు	కాంపౌండింగ్ ఫీజు	మొత్తం కేసులు
2022–23	రూ. 11,46,110	రూ.12,24,800	208
2023–24	రూ. 11,92,235	రూ.13,04,600	227
2024–25	రూ.12,22,575	రూ.13,87,500	200



చర్యలు తీసుకుంటాం



కొలతల్లో తేడాలు వస్తే సంబంధిత దుకాణాలు, వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం .లీగల్‌మెట్రాలజీ నిబంధనలను ప్రతి వ్యాపారి పాటించాలి. తూకాల్లో తేడాలు వస్తే కేసులు నమోదు చేస్తున్నాం. తూకాల్లో జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– పి జయదేవ్, లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్, ప్రొద్దుటూరు.

అకాల వర్షం.. అపార నష్టం

అట్లూరు: అకాల వర్షాలు రైతులు ఉసురుతీస్తున్నాయి. ఆరుగాలం కష్టించి లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు చేతి కందే సమయంలో ప్రకృతి ఆగ్రహానికి గురై కన్నీటి పాలవుతున్నాయి. మండల పరిధిలో గురువారం రాత్రి కురిసిన గాలీ వాన మామిడి రైతులను అతలాకుతలం చేసింది. కామసముద్రం, కోనరాజుపల్లి, కమలకూరు, వేమలూరు తదితర గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా పెంచుకున్న మామిడి చెట్లు గాలీ వానకు నేల పాలయ్యాయి. దీంతో మామిడి రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నిలిపోయిన విద్యుత్ సరఫరా

మండల వ్యాప్తంగా గురువారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. మండల పరిధిలోని పలు ఇళ్ల పైకప్పులు లేచి పోయాయి. వేమలూరు, మాడపూరు, మణ్యంవారిపల్లి, కమలకూరు, చౌటపల్లి, మహమ్మద్‌బాయిపల్లి తదితర గ్రామాల్లో సుమారు 20 విద్యుత్తు స్తంభాలు నేల కొరిగాయి. దీంతో మండలంలో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. విద్యుత్తు సరఫరా లేక పోవడంతో తాగు నీటి కోసం ప్రజలకు అవస్థలు తప్పడంలేదు.



రాలిపోయిన మామిడికాయలు



కామసముద్రంలో విరిగిన మామిడి చెట్లు



ఒరిగిన విద్యుత్ స్తంభం

మానవసేవే మాధవసేవ



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

పోరుమామిళ్ల: మానవసేవే మాధవసేవ అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. మదర్ థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంగసముద్రం పంచాయతీలో సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి ఏర్పాటు చేసిన బ్రయాన్స్ వృద్ధాశ్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రత్యక్షంగా చూస్తున్నామని, వారికి దేవుడు అండగా ఉండాలని ఆకాంక్షించారు. వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు రవిప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తన 56వ జన్మదిన సందర్భంగా వృద్ధులకు బ్రయాన్స్ వృద్ధాశ్రమం ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు చిత్తా ఆరోగ్యరాణి, గిరి ప్రణీత్‌రెడ్డి, అమితారెడ్డి, ప్రజ్వలారెడ్డి, ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి, ఆప్కాస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె. రమణారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాపాటి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, సర్పంచులు రఘునాథరెడ్డి, రమణారెడ్డి, మాజీ సర్పంచ్ మాలకొండయ్య, హ్యూమన్‌రైట్స్ నేత గంగన్న, సాయి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం



బద్వేలు అర్బన్ : కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



ప్రొద్దుటూరు రూరల్ : మాట్లాడుతున్న సీడీపీఓ అరుణకుమారి

బద్వేలు అర్బన్ : శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని హెల్త్ ఎడ్యుకేటర్ బి.వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రావతి పేర్కొన్నారు. తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ పరిధిలోని తిరువెంగళాపురం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమంపై బాలికలకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు, రక్తహీనత, బాలికల హక్కులు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుక్తవయస్సులో ఉన్న బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరీ వికాసం కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన కల్పించాలి

ప్రొద్దుటూరు రూరల్ : కిశోర బాలికలకు అన్ని విషయాల్లో అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి పేర్కొన్నారు. కిశోర బాలికల వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని 25 గ్రామ సచివాలయాల పరిధిలోని అవగాహన సదస్సులు నిర్వహించారు. తాళ్లమాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ అవగాహన కార్యక్రమాలు జూన్ 10వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. కిశోర బాలికలను అంగన్‌వాడీ కేంద్రాలకు పిలిచి ఒకరికొకరు పరిచయం చేసి, వారు సాధించాల్సిన లక్ష్యాల గురించి వివరిస్తారన్నారు. వారితో సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కళావతి, ఈశ్వరమ్మ, రఫియాభాను, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల యానిమేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంత్యుత్సవం



ప్రత్యేక అలంకరణలో ఆదిశంకరాచార్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆదిశంకరాచార్య జయంత్యుత్సవాలు శివాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆదిశంకరాచార్యుల విగ్రహానికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. కడప జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 27 మంది బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉపనయనం చేశారు.

- స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో 10 మంది బ్రాహ్మణ వటువులకు సామూహిక ఉపనయనం కార్యక్రమం నిర్వహించారు. సుమూహర్తంలో వటువులకు యజ్ఞోపవీత ధారణ, బ్రహ్మోపదేశం బ్రహ్మశ్రీ దుర్భాక వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కంబగిరి రావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో వ్యర్థాలు వేస్తే చర్యలు



ట్రాక్టర్ యజమానులను హెచ్చరిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో భవన నిర్మాణాల, కూల్చివేత వ్యర్థాలు వేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం బైపాస్‌రోడ్డులో వ్యర్థాలను వదులుతున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇకపై ఎవరైనా బైపాస్‌రోడ్డులో వ్యర్థాలు వేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. మున్సిపాలిటీలోని 23 మంది ప్లానింగ్ సెక్రటరీలతో నిఘా ఉంచుతామని వెల్లడించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పట్టణంలో భవన నిర్మాణాల, కూల్చివేతల వ్యర్థాలను సీమాంక్ ఆసుపత్రి పక్కన నీటికుంటలో మాత్రమే వేయాలని సూచించారు. అంతేకాకుండా నిబంధనలు ఉల్లంఘించి ఎక్కడైనా వ్యర్థాలు వదులుతున్నట్లు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

పట్టణ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పట్టణ సుందరీకరణే తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక విభాగం అధికారి సతీష్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బి.జయరామిరెడ్డి

ప్రొద్దుటూరు : విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.జయరామిరెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆచార్య బి.జయరామిరెడ్డి మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఫేర్‌వెల్ ఒక కొత్త ప్రారంభానికి నాంది అని తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ కేవీ రమణయ్య మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచం టెక్నాలజీ వైపు పరుగెడుతోందని, విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకొని అభివృద్ధి వైపు పయనించాలని సూచించారు. పది మందికి కొలువులు ఇచ్చే స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. మెకానికల్ హెచ్‌ఓడీ ఆచార్య జి.జయచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు మీ జీవితం మీ తల్లిదండ్రుల మీద ఆధారపడి కొనసాగింది, ఇక మీదట అలా కాకుండా మీ మీద ఇతరులు ఆధారపడే విధంగా మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ సి.నాగరాజు, ఎంఎంటీ కోఆర్డినేటర్ ఎస్.హరినాథ్‌రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

గోపవరం : ఏపీ మోడల్ స్కూల్‌కు మండలంలోని శీలంవారిపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.రవిశంకర్ తెలిపారు. గత నెలలో ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశం కోసం జరిగిన ప్రవేశ పరీక్షలో పాఠశాలకు చెందిన శీలిదీక్ష, శీలియశ్వంత్ అనే విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. గత ఏడాది ఇదే పాఠశాల నుండి నరసాపురం మోడల్ స్కూల్‌కు 5 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. రాబోయే రోజుల్లో మోడల్‌స్కూల్, గురుకుల, నవోదయ ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను తీర్చిదిద్ది ఎంపికయ్యేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రుణాల మంజూరు ఎప్పుడో?

- ఆందోళనలో అర్హులు
- రుణాల కోసం ఎదురుచూపులు



బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

కాశినాయన : నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేసింది. అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాల్సి ఉంది. అయితే రుణాల మంజూరులో రాజకీయం చోటు చేసుకోవడంతో అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే రుణాలు అందుతాయనే వినికిడి ఉంది. దీంతో అర్హులైన వారికి రుణాల మంజూరు ప్రశ్నార్థకంగా మారింది. మండలానికి బీసీ రుణాల కింద 19 యూనిట్లు మంజూరయ్యాయి. మండలంలో 30 గ్రామాలు ఉన్నాయి. 19 యూనిట్లను నరసాపురం ఏపీజీబీ, ఇటుగుల్లపాడు ఏపీజీబీ, పోరుమామిళ్ల ఏపీజీబీ బ్యాంకుల పరిధిలో మంజూరు చేయాల్సి ఉంది. ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంత వరకు రుణాలు మంజూరు చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. 19 యూనిట్లకు గాను 175 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుకు రూ.500లు ఖర్చు పెట్టి ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు ఫిబ్రవరి నెలలో ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు.

నాయకుల అండదండలుంటే..

రాజకీయ నాయకుల అండదండలు ఉన్న వారికి మాత్రమే రుణాలు మంజూరు చేయాలని అధికార పార్టీ నాయకులు మౌఖికంగా ఆదేశించడంతో ఇంత వరకు రుణాలు మంజూరు కాలేదు. దీంతో సబ్సిడీ రుణాలు వస్తే చిన్నపాటి వ్యాపారం పెట్టుకుని జీవనం సాగించాలని ఆశిస్తున్న వారు నిరాశ చెందుతున్నారు. ఎప్పుడు రుణాలు వస్తాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. పేద వారు స్వయం ఉపాధి పొందడానికి ప్రభుత్వం అందజేస్తున్న రుణాల విషయంలో రాజకీయ నాయకుల జోక్యంపై అర్హులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు అర్హులైన వారికి సబ్సిడీ రుణాలు అందించాలని కోరుతున్నారు.

జాబితా జిల్లా కేంద్రానికి పంపించాం

రెండు నెలల క్రితం బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి జాబితాను సంబంధిత బ్యాంకులకు, జిల్లా అధికారులకు పంపాం. అక్కడ నుంచి మంజూరు జాబితా వచ్చిన వెంటనే ఎంపిక చేసిన వారికి తప్పకుండా రుణాలు మంజూరు చేస్తాం.

–మైథిలి, ఎంపీడీఓ, కాశినాయన మండలం

బాలెలతో కష్టం.. యంత్రంతో సులభం





మారుతున్న కాలంతో పాటు వ్యవసాయంలో కూడా మార్పులు వస్తున్నాయి. గతంలో పసుపు కొమ్ములను రైతులు బాలెల ద్వారా ఉడకబెడుతుండేవారు. ప్రస్తుతం చాలామంది రైతులు బాలెల ద్వారా కాకుండా ఆవిరి యంత్రాలు రావడంతో పసుపు ఉడకబెట్టడం సులువుగా మారిందని, బాలెలతో అయితే ఎంతో కష్టంతో కూడుకున్న పని అని వారు చెబుతున్నారు. బాలెలతో అయితే రోజుకు 20– 25 కింటాళ్లు, ఆవిరి యంత్రంలో అయితే 40–45 క్వింటాళ్లు ఉడకబెట్టవచ్చునని రాజుపాళెం మండలంలోని టంగుటూరు గ్రామ రైతులు అంటున్నారు.

– రాజుపాళెం

అటవీ భూములు కాపాడండి

ప్రొద్దుటూరు : అటవీ భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని ప్రజాపక్షం పార్టీ నాయకులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ సాయినాథ్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కొందరు అటవీ భూములను ఒక పథకం ప్రకారం తప్పుడు రికార్డులను సృష్టించి ఆక్రమించుకుని విక్రయిస్తున్నారని తెలిపారు. కొన్నేళ్లుగా అటవీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఫిర్యాదులు చేస్తున్నా, ఆయా జిల్లాలోని అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో నలమల్ల, వెలుగొండ అడవుల పరిధిలో ఎక్కువగా అటవీభూముల ఆక్రమణలు జరుగుతున్నాయని తెలిపారు. అటవీ భూములు కాపాడి, వృక్ష సంపద, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ నాయకులు మునిసుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.